వరంగల్ వాయిస్
Evening Daily
www.warangalvoice.net
వరంగల్ | సంపుటి : 03 | సంచిక : 330 శుక్రవారం | 19 జులై 2024 | పేజీలు : 08 | వెల రూ. 5



దత్తక్షేత్రంలో 21న గురు పౌర్ణమి ఉత్సవాలు

8లో..



2లో..

# ఘరానా దొంగ అరెస్టు

పనిచేస్తున్న షాపులోనే చోరీ
భారీగా బంగారం స్వాధీనం
వివరాలు వెల్లడించిన సీపీ



8లో

# తెలంగాణలో భారీ వర్షం

పలు జిల్లాలకు రెడ్ అలెర్ట్
గ్రేటర్ వరంగల్‌లో కంట్రోల్ రూమ్



2లో

# డెడ్ లైన్ ఆగస్ట్ 15

కాళోజీ కళాక్షేత్రం పనులు పూర్తి చేయాలి
హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య




# అపార్ట్‌మెంట్ స్కూల్



ఒకే యాజమాన్యం రెండు పాఠశాలలు
ప్లే వే పేరిట ఫీజుల దోపిడీ
పట్టించుకోని విద్యాశాఖ
విద్యార్థి అభ్యాసంపై ప్రభావం

వివరాలు 2లో..

పట్టణాల్లోని పాఠశాలలు జైళ్లను తలపిస్తున్నాయి. గాలి, వెలుతురు ధారాళంగా వచ్చేలా ఉండాల్సిన తరగతి గదులు చిమ్మ చీకట్లో మగ్గుతున్నాయి. కరెంట్ ఉన్నంతసేపే అక్కడ వెలుగులు.. కరెంట్ పోయిందంటే ఎవరు ఎక్కడ ఉన్నరో తెలియని పరిస్థితి నేటి పాఠశాలల్లో నెలకొంది. విశాలమైన తరగతి గదులు, పిల్లలు ఆడుకునేందుకు ప్లే గ్రౌండ్ ఉండాల్సిన పాఠశాలలు నేడు అపార్ట్‌మెంట్‌లకు పరిమితమవుతున్నాయి. పాఠశాలల్లో స్థితిగతులను పర్యవేక్షించాల్సిన విద్యాశాఖ అధికారులు తమకు నెల నెల ఎంత ముట్టజెపుతారనే విషయంపైనే పాఠశాల యాజమాన్యంతో బేరాలాడుతున్నారు తప్ప విద్యార్థులకు కనీస వసతులు కల్పించడంపై శ్రద్ధ చూపకపోవడం శోచనీయం. యథా రాజా..తథా ప్రజా అన్నట్లుగా అధికారులు అమ్యామ్యాలకు ఆశపడుతుంటే పాఠశాల యాజమాన్యాలు యథేచ్ఛగా ఫీజుల దోపిడీకి పాల్పడుతున్నారు. ఇదే కోవలోకి మహబూబాబాద్ పట్టణంలోని వండర్ కిడ్స్ పాఠశాల చేరుతోంది. అపార్ట్ మెంట్‌లో పాఠశాల రన్ అవుతున్నా విద్యాశాఖ అధికారులు అటువైపు కన్నెత్తికూడా చూడకపోవడం వెనుక పెద్ద మొత్తంలోనే చేతులు మారాయన్న ఆరోపణలున్నాయి. - వరంగల్ వాయిస్, మహబూబాబాద్

# అపార్ట్ మెంట్ స్కూల్

## ఒకే యాజమాన్యం రెండు పాఠశాలలు
## ప్లే వే పేరిట ఫీజుల దోపిడీ
## పట్టించుకోని విద్యాశాఖ
## విద్యార్థి అభ్యాసంపై ప్రభావం



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** పాఠశాలల స్వరూపాలు మారుతున్నాయి. గతంలో ప్రతి పాఠశాలకు విశాలమైన ప్రాంగణం ఉండేది. అందులోనే బాలబాలికలు వేర్వేరుగా ఆడుకునేలా ప్లే గ్రౌండ్, మరుగుదొడ్లు, తాగునీటి సదుపాయాలు ఏర్పాటు చేసేవారు. పాఠశాలల్లోని ఆహ్లాదకరమైన వాతావరణం విద్యార్థి అభ్యసన సామర్థ్యాన్ని పెంచుతాయి. నేడు కార్పొరేటర్ పాఠశాలలన్నీ అపార్ట్ మెంట్ లకే పరిమితమవుతున్నాయి. గాలి, వెలుతురు సోకని తరగతి గదుల్లో సాగుతన్న విద్యాభ్యాసం విద్యార్థి అభ్యాసంపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ప్లే వే పేరిట అధిక మొత్తంలో ఫీజుల దోపిడీకి పాల్పడుతున్నా పట్టించుకునేవారే కరువయ్యారు.

### వండర్ కిడ్స్‌లో వసతులు కరువు..

విద్యార్థులకు ఆహ్లాదకరమైన వాతావరణం అందించాల్సిన పాఠశాలలు అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నాయి. పట్టణ కేంద్రంలోని వండర్ కిడ్స్ ప్రైవేటు పాఠశాల ఇదే పరిస్థితి నెలకొంది. విద్యార్థుల నుంచి భారీగా ఫీజులను వసూలు చేయటం తప్ప కనీస వసతులు కల్పించడంలో పాఠశాల యాజమాన్యం పూర్తిగా విఫలమైందని విద్యార్థుల తల్లిదండ్రులు



ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలోని ఒక అపార్ట్ మెంట్ లో గదులను కిరాయికి తీసుకొని పాఠశాలను నడుపుతున్నా పట్టించుకునేవారే కరువయ్యారంటున్నారు. అరకొర వసతుల్లోనే విద్యార్థులు కాలం వెళ్లదీస్తున్నారు. ఆడుకునేందుకు కనీసం క్రీడా మైదానం కూడా లేదు. బరువున్న పుస్తకాల బ్యాగులను వీపున పెట్టుకొని అపార్ట్ మెంట్ మెట్లు ఎక్కలేక విద్యార్థులు నానా ఇబ్బందులు పడుతున్నారని పేరెంట్స్ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో చిన వయసులోనే కాళ్ల నొప్పులతో బాధపడుతున్నారంటున్నారు. ప్లే స్కూల్ పేరిట వండర్ కిడ్స్ పాఠశాల యాజమాన్యం విద్యార్థుల తల్లిదండ్రులను పీల్చి పిప్పి చేస్తున్నారని మండిపడుతున్నారు. స్కూల్ బుక్స్, బెల్టులను వారే విక్రయిస్తూ అందిన కాడికి దోచుకుంటున్నారని విమర్శిస్తున్నారు.

### కళ్లు మూసుకున్న విద్యాశాఖ..

ప్రైవేట్ పాఠశాలల్లో వసతుల కల్పనతోపాటు, విద్యార్థుల స్థితిగతులపై ఎప్పటికప్పుడు దృష్టి సారించాల్సిన విద్యాశాఖ అధికారులు ప్రైవేట్ స్కూళ్ల యాజమాన్యాలు ఇచ్చే మామూళ్లకు ఆశపడి అటువైపు కన్నెత్తి కూడా చూడడంలేదన్న విమర్శలున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి అపార్ట్ మెంట్ లో రన్ అవుతున్న వండర్ కిడ్స్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని స్థానికులు, విద్యార్థులు తల్లిదండ్రులు కోరుతున్నారు.



# ఘరానా దొంగ అరెస్టు

## పనిచేస్తున్న షాపులోనే చోరీ
## భారీగా బంగారం స్వాధీనం
## వివరాలు వెల్లడించిన సీపీ

**వరంగల్ వాయిస్, క్రైం :** బంగారం కరిగించే షాపులో నమ్మకం అనే ముసుగులో పనిచేస్తూ అదును చూసి భారీ మొత్తంలో బంగారాన్ని చోరీ చేసిన ఘరానా దొంగను సీసీఎస్, మట్వాడా పోలీసుల సంయుక్త ఆధ్వర్యంలో అరెస్టు చేశారు. అతడి నుంచి సుమారు రూ.52 లక్షల విలువగల 700 గ్రాముల బంగారు బిస్కెట్లతో పాటు ఒక సెల్‌ఫోన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ అరెస్టుకు సంబంధించిన వివరాలను వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా శుక్రవారం వివరించారు. మహరాష్ట్రకు చెందిన సురేష్ లక్ష్మన్‌బాద్ నగరంలో ఒంటరిగా జీవిస్తూ బంగారం వ్యాపారం నిర్వహిస్తుండేవాడు. ఈ వ్యాపారం ద్వారా వచ్చే అదాయంతో తాగుడు, సట్టా, మట్కా లాంటి జూదాలకు బానిసగా మారి అప్పుల పాలయ్యాడు. కొద్ది రోజులు ఉపాధి కొసం ప్రయత్నించినా ప్రయోజనం లేకపోవడంతో సొంతంగా పిజ్జా వ్యాపారాన్ని నిర్వహించారు. జల్సాల కారణంగా అందులోనూ నష్టపోయాడు. తాను చేసిన అప్పుల తీర్చాలంటే ఎద్కెనా బంగారం దుకాణం లూటీ చేయడమే మార్గమని తలంచిన లక్ష్మన్‌బాద్ తనకు పరిచయస్తుడి ద్వారా విశ్వకర్మ వీధిలో బంగారం కరిగించే బట్టి వ్యాపారి సంజయ్ వద్ద మే నెల 24 న పనిలో చేరాడు. కొద్ది రోజులుగా నమ్మకంతో పనిచేయడంతో సంజయ్ తన దుకాణా తాళాలు లక్ష్మన్‌బాద్ అందజేసి బయటి వేళ్ళేవాడు. దీంతో నిందితుడు జూన్ 14న తన యజమాని బయటికి వెళ్లడంతో షాపులోని సీసీ కెమెరాలను అపివేసి దుకాణంలో వున్న ఎనిమిది వందల గ్రామాల బంగారాన్ని చోరీ చేసి అక్కడి నుంచి పారిపోయాడు. జరిగిన దొంగతనంపై షాపు యజమాని ఇచ్చిన ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేశారు. సెంట్రల్ జోన్ డీసీపీ షేక్ సలీమా, అదనపు డీసీపీ రవి అధ్వర్యంలో సీసీఎస్, మట్వాడా ఇన్‌స్పెక్టర్లతో ప్రత్యేక దర్యాప్తు బృందాలను ఏర్పాటు చేశారు. అయితే గురువారం నింధితుడు సికింద్రబాద్ నుంచి విజయవాడకు రైలులో ప్రయాణిస్తుండగా సాయంత్రం 6.30 గంటల ప్రాంతంలో అదుపులోకి తీసుకున్నారు.

# డెడ్ లైన్ ఆగస్ట్ 15

## కాళోజీ కళాక్షేత్రం పనులు పూర్తి చేయాలి
## హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** కాళోజీ కళాక్షేత్రం నిర్మాణ పనులను ఆగస్టు 15 లోపు పూర్తిచేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య అధికారులను, నిర్మాణ సంస్థ ప్రతినిధులను ఆదేశించారు. శుక్రవారం హనుమకొండ బాలసముద్రంలో నిర్మాణంలో ఉన్న కాళోజి కళా క్షేత్రం పనులను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా పనులను వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ కాళోజీ కళాక్షేత్రం నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని, ఆగస్టు 15 నాటికి అన్ని పనులను వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. నిబంధనల మేరకు నిర్మాణ పనులు ఉండే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. కాళోజీ కళా క్షేత్రంలోని ఏయే నిర్మాణ పనులు అసంపూర్తిగా ఉన్నాయో వాటిని త్వరగా పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, కుడా పీఓ అజిత్ రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

### మెరుగైన వైద్యం అందించాలి..

ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలను అందించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య సూచించారు. శుక్రవారం కాజీపేట దర్గాలోని బస్తీ దవాఖానను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా బస్తీ దవాఖానకు సంబంధించిన గదులను, వైద్యులు, సిబ్బంది, ప్రజలకు వైద్య సేవలు అందించే రికార్డులను కలెక్టర్ పరిశీలించారు. వైద్యులు, సిబ్బంది హాజరుపై కలెక్టర్ ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి, బస్తీ దవాఖానాల నోడల్ అధికారి ఇఫ్తేకారు అహ్మద్, మెడికల్ అధికారి వివేక్, తదితరులు పాల్గొన్నారు.



# రైతు సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయం

## స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి

**వరంగల్ వాయిస్, రఘునాథపల్లి :** రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని మాజీ ఉపముఖ్యమంత్రి, స్టేషన్ ఘన్ పూర్ శాసనసభ్యులు కడియం శ్రీహరి అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడు మాసాలే అయినప్పటికీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో సంక్షేమ కార్యక్రమాలు ఎక్కడ ఆగకుండా పేదవారిని ఆదుకుంటున్నారని స్పష్టం చేశారు. రఘునాథపల్లి మండల కేంద్రంలోని ఏఎస్ఆర్ ఫంక్షన్ హాల్లో శుక్రవారం ఏర్పాటు చేసిన కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణి కార్యక్రమానికి కడియం శ్రీహరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రఘునాథపల్లి మండలానికి చెందిన 160 మంది లబ్ధిదారులకు రూ.1,60,18,560 విలువ కలిగిన కల్యాణ లక్ష్మి చెక్కులను, అలాగే 22 మంది ముఖ్యమంత్రి సహాయ నిధి లబ్ధిదారులకు రూ.5లక్షల విలువగల చెక్కులను ఎమ్మెల్యే కడియం శ్రీహరి పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో మండల ప్రజా ప్రతినిధులు, అధికారులు నాయకులు పాల్గొన్నారు.

## సీఎం చిత్రపటానికి పాలాభిషేకం



**వరంగల్ వాయిస్, సంగెం :** మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ రైతులకు ఇచ్చిన రూ. 2లక్షల రుణమాఫీ హామీని నెరవేర్చేందుకు గురువారం ఏకకాలంలో లక్ష రూపాయల రుణమాఫీ చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు తెలుపుతూ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ బైక్ ర్యాలినీ సంగెం మండలం వంజారపల్లి గ్రామం నుంచి పరకాల శాసన సభ్యుడు రేవూరి ప్రకాశ్ రెడ్డి బైక్ నడుపుతూ ప్రారంభించారు. అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అక్కడి నుంచి రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్యతో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు రైతులతో కలిసి బైక్ ర్యాలీ ప్రారంభమై సంగెం మండల పరిధిలోని అన్ని గ్రామాల గుండా ర్యాలీ సాగింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

## రోడ్డుపై గుంతలు పూడ్చిన పోలీసులు



**వరంగల్ వాయిస్, రేగొండ :** రేగొండ-పరకాల ప్రధాన రహదారి నేషనల్ ఆర్ అండ్ బీటీ రోడ్డు వర్షాల ధాటికి పూర్తిగా గుంతలుగా మారడంతో వాహనదారులు రాకపోకల కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వారి ఇబ్బందులను గుర్తించిన రేగొండ ఎస్ఐ ఎన్ రవికుమార్ ఆదేశాల మేరకు కానిస్టేబుల్స్ కిరణ్ సింగ్, శ్రీశైలం ఆధ్వర్యంలో రోడ్డుపై ఉన్న గుంతలను పూర్తిగా పూడ్చివేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోడ్లపై ఉన్న గుంతలతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. వారి ఇబ్బందులను గుర్తించి రోడ్డుపై ఉన్న గుంతలను పూడ్చివేశామని వారు తెలిపారు.

## ఉత్తమ ప్రతిభ కనబరిచిన అధికారులకు జ్ఞాపికలు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్ 16 సర్కిళ్ల పరిధిలో తమ పనితీరులో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన అధికారులకు వివిధ కేటగిరీల్లో నెల నెల ర్యాంకులు ప్రకటిస్తున్నారు. ఈ సందర్భంగా టీజీ ఎన్పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయం, విద్యుత్ భవన్ లో శుక్రవారం సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి మే నెలకు సంబంధించి ఉమ్మడి వరంగల్ జిల్లాలకు సంబంధించి జ్ఞాపికలు, ప్రశంశాపత్రం అందజేశారు. ఇందులో డిస్కం డీఈ విభాగంలో 3వ స్థానం జి.సాంబా రెడ్డి-డీఈ హనుమకొండ టౌన్ ఆపరేషన్, ఉమ్మడి వరంగల్ ఏడీఈ విభాగంలో పి.మల్లికార్జున్-ఏడీఈ హనుమకొండ టౌన్ ఆపరేషన్, ఏఈ విభాగంలో యం.ప్రవీణ్, ఏఈ హనుమకొండ టౌన్ ఆపరేషన్ నక్కలగుట్ట సెక్షన్, హనుమకొండ సర్కిల్ ఏఈ రమేష్-దామెర ఆపరేషన్ సెక్షన్, ఉమ్మడి వరంగల్ జిల్లాల పరిధిలో బెస్ట్ ఇంప్రూవ్మెంట్ అచీవ్డ్ సీహెచ్ నవీన్ కుమార్ ఏఈ హనుమకొండ టౌన్ ఆపరేషన్ సుబేదారి సెక్షన్, హనుమకొండ సర్కిల్ బెస్ట్ ఇంప్రూవ్మెంట్ అచీవ్డ్ బి.పద్మ ఏఈ హనుమకొండ రూరల్ డివిజన్ ఐనవోలు సెక్షన్ లకు అందచేశారు. ఈ సందర్భంగా సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి మాట్లాడుతూ పని తీరులో మెరుగు పరచుకొని జ్ఞాపికలు అందుకున్న ప్రతి ఒక్కరికి శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే అందరు మరింత కష్టపడి పనిచేసి వినియోగదారులకు అంతరాయాలు లేని విద్యుత్ సరఫరా అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి డైరెక్టర్ టి.మధుసూదన్, సీజీఎం కె.కిషన్, హనుమకొండ ఎస్ఈ కె.వెంకట రమణ, హనుమకొండ రూరల్ డివిజన్ డీఈ బి.సామ్య నాయక్, ఏడీఈ పరకాల దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

# అర్హులకు ఇండ్ల స్థలాలు, ఇండ్లు నిర్మించి ఇవ్వాలి

### సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** అర్హులైన నిరుపేదలకు ఇండ్ల స్థలాలు కేటాయించి పక్కా గృహాలు నిర్మించి ఇవ్వడంతో పాటు గతంలో నిర్మించిన డబుల్ బెడ్రూంలు నిరుపేదలకు పంపిణీ చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి డిమాండ్ చేశారు. శుక్రవారం హనుమకొండ మండల తహసీల్దార్, కాజీపేట తహశీల్దారు కార్యాలయం ఎదుట సీపీఐ ఆధ్వర్యంలో గుడిసె వాసులతో కలసి ధర్నా నిర్వహించారు. ధర్నా అనంతరం తహసీల్దార్ కు మెమోరాండం అందజేశారు. ఈ సందర్భంగా ధర్నా కార్యక్రమానికి జిల్లా సమితి సభ్యుడు కొట్టేపాక రవి అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా పాల్గొన్న కర్రె భిక్షపతి మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం సిద్ధించి 77 సంవత్సరాలు గడిచినప్పటికీ పేద ప్రజలకు గూడు, కూడు, కూలి దొరకక కష్టజీవులు అనేక అష్ట కష్టాలు పడుతున్నారని, అదేవిధంగా హనుమకొండ మండలంలో నిలువ నీడ లేని, సెంటు భూమి లేని నిరుపేదలు ఎంతో మంది ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలో గుండ్ల సింగారం, పలువేల్పుల గ్రామాలతో పాటు మండల కేంద్రంలో జంగబద్రయ్య నగర్, సుందరయ్య నగర్-1, సుందరయ్య నగర్-2, ఎల్.వి.ఆర్ నగర్, భగత్ సింగ్ నగర్, గణేష్ నగర్, పోచమ్మ కుంటతో పాటు పాలు ప్రాంతాల్లో భారత కమ్యునిస్టు పార్టీ(సీపీఐ) ఆధ్వర్యంలో గత అనేక సంవత్సరాలుగా ఆనేక మంది పేదప్రజలు గుడిసెలు వేసుకొని నివాసం ఉంటున్నారని వారు అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో గత బీఆర్ఎస్ సర్కార్ గుడిసె వాసులకు పట్టాలు ఇవ్వడంతో పాటు డబుల్ బెడ్రూంలు ఇస్తామని చెప్పి ఆ వాగ్దానం తుంగలో తొక్కిన నేపథ్యంలో బీఆర్ఎస్ ను అసెంబ్లీ ఎన్నికల్లో ఓడించడం జరిగిందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఇప్పుడు రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రజా పాలన పేరుతో పాలన కొనసాగిస్తుందని, అదే విధంగా కాంగ్రెస్ ఇచ్చిన 6 గ్యారెంటీలల్లో ఒక్కటైనా ఇందిరమ్మ ఇళ్లు పథకం అనేక సంవత్సరాలుగా పేదలు గుడిసెలు వేసుకొని నివసిస్తున్న వారందరికీ వర్తింప చేసి ఇండ్ల పట్టాలు ఇచ్చి పక్క గృహాలు నిర్మించి ఇవ్వాలని, అదేవిధంగా గతంలో నిర్మించిన డబుల్ బెడ్రూంలు నిరుపేదలకు కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు నద్దునూరి అశోక్ స్టాలిన్, సీపీఐ జిల్లా సమితి సభ్యులు ఏశబోయిన శ్రీనివాస్, కొట్టెపాక రవి, దామెర సుదర్శన్, దళిత హక్కుల పోరాట సమితి జిల్లా కార్యదర్శి రొంటాల దేవా, నాయకులు గుంటి రాజేందర్, అమృతయ్య, జి.శివ కుమార్, విజయ లక్ష్మీ, మంగా, మౌనిక, పి.రాము, ఏం.నారాయణ, కె.అనిల్, భూ పోరాట నాయకులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల ఔదార్యం



**వరంగల్ వాయిస్, నెల్లికుదురు :** మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలకు చెందిన 1999- 2000 సంవత్సరం పదవ తరగతి పూర్వ విద్యార్థులు లక్ష రూపాయల విలువ చేసే వాటర్ ప్యూరిఫైడ్, ఫ్రిజర్ బహూకరించి తమ ఔదార్యాన్ని చాటుకున్నారు. గురువారం పూర్వ విద్యార్థులు వాటిని తహసీల్దార్ కోడి చింతల రాజు, ఎస్సై కనుకుల క్రాంతి కిరణ్, ఎంఈఓ గుగులోతు రాము చేతుల మీదుగా పాఠశాలకు అందజేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా హాజరైన తహసీల్దార్, ఎస్సై మాట్లాడుతూ ఉన్న ఊరును చదువుకున్న పాఠశాలను మరవకుండా పూర్వ విద్యార్థులంతా ఏకమై సేవా కార్యక్రమాలు చేస్తూ పాఠశాల అభివృద్ధిలో భాగస్వాములు కావడం అభినందనీయమన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్న విద్యార్థులు ఎంతోమంది ఉన్నత స్థితిలో ఉన్నారని, వారిని స్ఫూర్తిగా తీసుకొని విద్యార్థులు మంచి భవిష్యత్తును ఎంచుకోవాలన్నారు. పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ ఇటీవల కాలంలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఏర్పాటు చేసుకొని అందరం జిల్లా పరిషత్ పాఠశాలకు తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని ముందుకు వచ్చామని తెలిపారు. భవిష్యత్తులో స్కూల్లో అనేక కార్యక్రమాలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రవి, ఎస్ఎంసీ చైర్మన్ పొన్నం మమతతో పాటు పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

## ముందస్తు అక్రమ అరెస్టులు



**వరంగల్ వాయిస్, పరకాల :** బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో నిరుద్యోగుల చలో సెక్రటేరియట్ ముట్టడిలో భాగంగా బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకుడు, తెలంగాణ ఉద్యమకారుడు కొమ్ముల శివను శాయంపేట మండల పోలీసులు అర్ధ రాత్రి రెండు గంటలకే అరెస్టు చేసి తమ కస్టడీలోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా కొమ్ముల శివ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడు నెలల కాలంలోనే తెలంగాణ ఉద్యమకారులను, నిరుద్యోగులను, యువజన, విద్యార్థి నాయకులకు భయపడి అరెస్టు చేయడం సిగ్గుచేటన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రంలో అసమర్థ పాలన కొనసాగిస్తున్నారని, ఇంతటి దుర్మార్గమైన చర్య ఎక్కడ కూడా లేదని, ఏడు నెలల కాలంలోనే ఉద్యమ నాయకులకు, విద్యార్థులకు భయపడితే రాబోయే ఐదేళ్లు రాష్ట్రాన్ని ఎలా పాలిస్తారని ప్రశ్నించారు. డీఎస్సీ ఉద్యోగాలు పెంచాలని నిరుద్యోగుల న్యాయమైన డిమాండ్ల సాధనకై శాంతియుతంగా పోరాడుతుంటే అక్రమ అరెస్టులు చేయడం, విలేకరుల పైన దాడులు చేయడం ఇదేనా ప్రజాపాలన అంటే అన్నారు. తక్షణమే జాబ్ క్యాలెండర్ ప్రకటించాలని, డీఎస్సీ ఉద్యోగాలు పెంచాలని, గ్రూప్1, 2, 3, 4, ఉద్యోగాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా అక్రమ అరెస్టులను నిలిపివేసి ప్రజా పాలన చేయాలని శివ కోరారు.

# రాయల చంద్రశేఖర్ మృతి తీరని లోటు



### సాధినేని వెంకటేశ్వరరావు

**వరంగల్ వాయిస్, వరంగల్ :** కామ్రేడ్ రాయల చంద్రశేఖర్ అకాల మరణం మా అందరిని తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శి సాదినేని వెంకటేశ్వరరావు అన్నారు. కామ్రేడ్ చంద్రశేఖర్ కమ్యూనిస్టు ఉద్యమం నేపథ్యం కలిగిన కుటుంబం నుంచి వచ్చాడని, నలుగురు అన్నదమ్ముల్లో కామ్రేడ్ చంద్రశేఖర్ చివరివాడని తెలిపారు. అందరికంటే పెద్దవాడు రాయల అప్పయ్య ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ లో బాధ్యుడిగా చివరికాలం వరకు పనిచేశారు. కామ్రేడ్ రాయల సుభాష్ చంద్రబోస్ ఏ రవి అన్న సిపిఐ(ఎంఎల్)కేంద్ర కమిటీ సభ్యుడు గాను, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శిగాను పనిచేసి అమరుడయ్యారు. కామ్రేడ్ రాయల నాగేశ్వరరావు పిండిప్రోలు గ్రామ సర్పంచ్ గా పనిచేశారు. విప్లవోద్యమానికి చివరి వరకు చేదోడువాదోడుగా నిలబడ్డారు. కామ్రేడ్ రాయల చంద్రశేఖర్ బాల్యం నుంచే విప్లవ రాజకీయాలకు ఆకర్షితుడయ్యాడు. ఖమ్మం ఎస్సార్ అండ్ బీజీఎన్ఆర్ కాలేజీలో చదువుకుంటూ కాలేజీ ఎన్నికల్లో సహాయ కార్యదర్శిగా ఎన్నికయ్యారు. విద్యార్థి ఉద్యమం నుంచి సీపీఐ(ఎంఎల్ )మాస్ లైన్ కేంద్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ గా, ఇటీవల ఎన్నిక అయ్యేవరకు మెట్టు మెట్టుగా విప్లవోద్యమంలో ఎదిగాడు. 1975 తర్వాత చంద్రశేఖర్ కొంతకాలం దళాల్లో పనిచేశాడు. అజ్ఞాత జీవితం గడిపాడు. పార్టీ నిర్ణయం మేరకు అనేక ప్రాంతాల్లో ముఖ్యంగా ఖమ్మం, ఇల్లెందు, మానుకోట, సత్తుపల్లి అశ్వరావుపేట, హైదరాబాద్ తదితర ప్రాంతాల్లో బాధ్యతలు తీసుకొని పనిచేశాడు. ఇల్లందు డి ఎల్ సి సభ్యుడుగా, ఖమ్మం డిసి సభ్యుడుగా, న్యూడెమోక్రసీ రాష్ట్ర కమిటీ నాయకుడిగా పనిచేశాడు. విప్లవోద్యమ క్రమంలో కామ్రేడ్ విమలను వివాహం చేసుకున్నారు. వారికి ఒక కుమారుడు పావెల్, తన సహచరి కామ్రేడ్ విమల కూడా చాలాకాలం విప్లవోద్యమంలో పనిచేసింది. ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర బాధ్యతలను నిర్వహించింది. కామ్రేడ్ రాయల్ చంద్రశేఖర్ అకాల మరణం చాలా బాధాకరం. కామ్రేడ్ చంద్రశేఖర్ కు సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ కేంద్ర కమిటీ తరఫున విప్లవ జోహార్లు అర్పించి, ఆ కుటుంబానికి తీవ్ర సంతాపాన్ని సానుభూతిని కేంద్ర కమిటీ తరపున తెలియజేశారు.

# రైతు రుణమాఫీ దేశానికే రోల్ మోడల్

## భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



**వరంగల్ వాయిస్, భూపాలపల్లి :** రైతు రుణమాఫీ దేశానికే మన తెలంగాణ రాష్ట్రం ఒక రూల్ మోడల్ అని, రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. నిన్న రైతు రుణమాఫీ నిధుల విడుదల చేసిన పండుగ సందర్భంగా, శుక్రవారం భూపాలపల్లిలోని మంజూరు నగర్ సింగరేణి ఏరియా ఆసుపత్రి నుంచి స్థానిక అంబేద్కర్ సెంటర్ వరకు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రైతులు, కాంగ్రెస్ నేతలతో పెద్ద సంఖ్యలో ఎడ్ల బండ్లు, ట్రాక్టర్లతో భారీ ర్యాలీ సాగుతుంది. కాగా, ఈ ర్యాలీలో ముఖ్య అతిథిగా భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు గారు పాల్గొని, ఎడ్ల బండిని స్వయంగా కొద్దిసేపు తోలి ప్రారంభించారు. ఈ ర్యాలీలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అంబేద్కర్ సెంటర్ వరకు స్వయంగా ట్రాక్టర్ నడుపుకుంటూ వచ్చారు. ఈ ర్యాలీ అంబేద్కర్ సెంటర్ కు చేరుకునే సమయానికి ఒక్కసారిగా వర్షం కురియడంతో ఆ వర్షంలోనే సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడుతూ భారతదేశంలోనే తెలంగాణ రాష్ట్రంలో ఏకకాలంలో రూ.2 లక్షల రుణమాఫీ దేశంలోనే నెంబర్ వన్ గా తెలంగాణ నిలిచిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం రుణమాఫీ కార్యక్రమాన్ని అమలు చేసిందని తెలిపారు. ధనిక రాష్ట్రాన్ని బీఆర్ఎస్ ప్రభుత్వం అప్పులు ఊబిలోకి నెట్టిందన్నారు. గత ప్రభుత్వంలో కేసీఆర్ రూ.7 లక్షల కోట్ల అప్పులు చేశాడని ఆరోపించారు. కష్టకాలంలో ఉండి కూడా సీఎం రేవంత్ రెడ్డి పైసా పైసా పోగేసి రైతు రుణమాఫీ చేయడానికి అహర్నిశలు కష్టపడి పని చేశారని హర్షం వ్యక్తం చేశారు.

## గుడుంబా స్థావరాలపై దాడులు



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాధ్ కేకన్ ఆదేశాల మేరకు గుడుంబా తయారీని సమూలంగా నిర్మూలించాలని ఉదేశ్యంతో తెల్లవారుజామున నుంచి దాడులు నిర్వహించి గ్రామస్థులకు గుడుంబా వల్ల జరిగే నష్టాల గురించి, వాటితో పాటు కొత్త చట్టాలు, సైబర్ నేరలు, ఆన్ లైన్, ఆర్థిక మోసాలు, బాల్య వివాహాలు, లైంగిక దాడులు, కఠిన శిక్షలపైన మహబూబాబాద్ జిల్లా పోలీసులు అధికారులు, సిబ్బంది అవగాహన కల్పిస్తున్నారు. ఈ దాడులలో జిల్లా పరిధిలో మొత్తం 273 లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకొని, నల్ల బెల్లం 187 కేజీలు, 5640 లీటర్ల చెక్కెర పానకాన్ని ధ్వంసం చేసి 32 కేసులు నమోదు చేయడం జరిగిందని మహబూబాబాద్ జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాధ్ కేకన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా వ్యాప్తంగా జరిపిన ఈ దాడులలో డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది కలిపి 130 మంది పాల్గొన్నారు. మహబూబాబాద్ జిల్లాలో ఎవరైనా అక్రమంగా గుడుంబా తయారీ చేసినట్లయితే వారిని బైండోవర్ చేసి కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అంతే కాకుండా మీ చుట్టుప్రక్కల ప్రాంతాల్లో ఎవరైనా గుడుంబా తయారీ చేస్తునట్టు తెలిసిన, అమ్మిన వెంటనే దగ్గరలోని పోలీసు స్టేషన్ లో సమాచారం అందించాలని కోరారు. వారి వివరాలు గొప్యంగా ఉంచడం జరుగుతుందని ఎస్పీ తెలిపారు.

## ఏఐఎస్ఎఫ్ నాయకుల అక్రమ అరెస్టు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** గ్రూప్ 2, 3 ఆస్పరెంట్స్ గ్రూప్ టు వాయిదా వేయాలనే డిమాండ్ తో హైదరాబాదులో సత్యాగ్రహ దీక్ష చేస్తున్న సందర్భంగా ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘం ఆ కార్యక్రమంలో లేనప్పటికీ శుక్రవారం తెల్లవారుజామున ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బాషబోయిన సంతోష్, రవితేజ అరెస్టు చేసి కేయూ పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఇటీవల కాలంలో ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఎవరూ పిలుపునిచ్చిన తమకు సంబంధం లేని కార్యక్రమాలను చూపి అరెస్టు చేయడం ఏఐఎస్ఎఫ్ నాయకుల రోజువారీ కార్యకలాపాలకు, వ్యక్తిగత స్వేచ్ఛకు పోలీసులు భంగం కలిగించినట్లే వారు అన్నారు. భవిష్యత్తులో ఇలాంటి అరెస్ట్ లలో ప్రభుత్వం పునారాలోచన చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే తమ కార్యచరణ దానికి అనుగుణంగా ఉంటుందని తెలియజేశారు.

## పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

### కార్పొరేటర్ మరుపల్ల రవి



**వరంగల్ వాయిస్, వరంగల్ :** గ్రేటర్ వరంగల్ మహానగర పాలక సంస్థ పాలన విధానం సరిగా లేనందువలననే ప్రజలు అంటు వ్యాధులకు గురై ఆస్పత్రి పాలగుతున్నారని 40వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్ల రవి మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన ప్రతి శుక్రవారం డ్రై డే కార్యక్రమం సందర్భంగా వరంగల్ మహానగర పాలక సంస్థ మలేరియా విభాగం హెల్త్ అసిస్టెంట్ శివకుమార్ ఆధ్వర్యంలో డివిజన్ లోని ఉర్సు ఉప్పరోని కుంట వద్ద గల నీరు నిలిచి ఉన్న గుంతలలో ఆయిల్ బాల్స్ ను వేసి ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. నేటి వర్షాకాలంలో తమ ఇండ్లతో పాటు పరిసరాలలో విపరీతంగా పిచ్చి మొక్కలు పెరగడం వలన గుంతలలో నీరు నిలిచి ఉండటం వలన దోమలు పుట్టుక వచ్చి ప్రజలకు హాని చేకూరుతుందని అని ఆయన తెలిపారు. తమ తమ ఇళ్లతో పాటు పరిసరాలలో పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించాలని, నీరు నిల్వ ఉన్నచో వెంటనే పార బోయాలని ఆయన సూచించారు. డివిజన్ లో పాతకాలంలో నిర్మించిన డ్రైనేజీలు సరిగా పనిచేయకపోవడం వలన ఆ ప్రాంతాలలో విపరీతంగా దోమలు తయారై ప్రజలకు హాని చేస్తున్నందున అనేకమంది వివిధ వ్యాధులతో ఆసుపత్రి పాలవుతున్నారన్నారన్నారు. ఈ ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలు అప్రమత్తంగా ఉండాలని 40వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్ల రవి ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో శాంతి హెల్త్ అసిస్టెంట్ శివకుమార్, ఆర్పీ లావణ్య, జవాన్ ప్రశాంత్, ఐలాపురం మహేష్ కుమార్, మలేరియా సిబ్బంది, ప్రదీప్, కిరణ్, సరితలు ఉన్నారు

## ఏనుగల్లులో అదనపు కలెక్టర్ పర్యటన



**వరంగల్ వాయిస్, పర్వతగిరి :** మండలంలోని ఏనుగల్లులో అడిషనల్ కలెక్టర్ సంధ్యారాణి రైస్ మిల్లు, హైస్కూల్, పల్లె ప్రకృతి వనాన్ని సందర్శించారు. హై స్కూల్‌లో అమ్మ ఆదర్శ కమిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న పనులను పరిశీలించి, మిగిలిన పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శంకర్‌నాయక్, ఎంఎన్ఓ లింగారెడ్డ, ఏపీఓ సుశీల్ కుమార్, ఏపిఎం కృష్ణమూర్తి, ఈసీరాజు, సిసిసుధాకర్, పంచాయతీ కార్యదర్శులు యాకూబ్ పాషా, రాజు, అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ సంధ్య పాల్గొన్నారు.

## ఏబీవీపీ మహానగర నూతన కమిటీ ఎన్నిక



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ హనుమకొండ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం బాలసముద్రంలోని ఏబీవీపీ కార్యాలయంలో వరంగల్ మహానగర నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగింది. జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని రాష్ట్ర ఉపాధ్యక్షుడు పెరుగు శ్యామ్, వరంగల్ విభాగ్ సంఘటన కార్యదర్శి కుంట హర్షవర్ధన్, జిల్లా కన్వీనర్ సుజిత్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ పెరుగు శ్యామ్ మాట్లాడుతూ 76 సంవత్సరాల నుంచి నిరంతరం విద్యారంగ సమస్యలతో పాటు జాతీయ పునర్నిర్మాణం కోసం పనిచేసే విద్యార్థి పరిషత్ విద్యార్థులకు జాతి భావజాలం నేర్పుతూ ముందుకు వెళ్లే ఏకైక సంస్థ ఏబీవీపీ అన్నారు. అదే విధంగా అనంతరం నూతన నగర కమిటీని ఎన్నుకోవడం జరిగింది. నూతన నగర అధ్యక్షుడిగా సంపత్, నగర కార్యదర్శిగా తాళ్లపల్లి అరుణ్ ను ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో పూర్వ నగర అధ్యక్షుడు కొత్తపల్లి సుధాకర్, హనుమకొండ జిల్లా కన్వీనర్ ఆరేపల్లి సుజిత్, తదితర కార్యకర్తలు పాల్గొన్నారు.

## పేద ప్రజలకు గొడుగుల పంపిణీ



**వరంగల్ వాయిస్, తొర్రూరు :** పట్టణ కేంద్రంలో శుక్రవారం లయన్స్ క్లబ్ రీజియన్ డిస్టిక్ గవర్నర్ తమ్మెర లక్ష్మీ నరసింహారావు పుట్టినరోజు సందర్భంగా పట్టణంలో లయన్స్ క్లబ్ ఆఫ్ తొర్రూర్ వినాయక ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో పేద ప్రజలకు గొడుగులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ డిస్టిక్ గవర్నర్ తమ్మెర లక్ష్మీ నరసింహరావు మాట్లాడుతూ తన పుట్టినరోజు సందర్భంగా వినాయక ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో పేద ప్రజలకు గొడుగులు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. ఎవరైనా తన పుట్టినరోజు సందర్భంగా తమకు తోచిన విధంగా పేద ప్రజలకు ఇలాంటి సేవా కార్యక్రమాలు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ పూర్వపు జిల్లా గవర్నర్ డాక్టర్ రాజేందర్ రెడ్డి, హెచ్ డబ్ల్యూ సీ కోఆర్డినేటర్ డాక్టర్ శారద, లయన్స్ క్లబ్ జోన్ చైర్ పర్సన్ రేగూరి శ్రీదేవి, వినాయక ఫ్రెండ్స్ అధ్యక్షుడు లయన్ పద్మ యాదగిరి, ప్రధాన కార్యదర్శి చిలుకమారి రామచంద్రయ్య, కోశాధికారి తల్లాడి హిరాదర్, వినాయక ఫ్రెండ్స్ అసోసియేషన్ సభ్యులు, స్థానిక ప్రజల పాల్గొన్నారు.

## సెక్యూరిటీ సంస్థ ప్రతినిధులకు ఆర్డర్ కాపీ అందజేత



**వరంగల్ వాయిస్, కేయూ :** ఆగష్టు 1 నుంచి కాకతీయ విశ్వవిద్యాలయం క్యాంపస్, విశ్వవిద్యాలయ కళాశాలలు, ఖమ్మం, కొత్తగూడెం పీజీ సెంటర్ లలో నూతన సెక్యూరిటీ సర్వీసెస్ ఏర్పాటు చేస్తునట్టు రిజిస్ట్రార్ ఆచార్య పి.మల్లారెడ్డి తెలిపారు. వైస్ ఛాన్సలర్ ఇంచార్జ్ కరుణ వాకాటి అనుమతులతో ఈ సెక్యూరిటీ వ్యవస్థను ఏర్పాటు చేస్తునట్టు అయన వెల్లడించారు. మొత్తం విశ్వవిద్యాలయ పరిధిలోని అన్ని విశ్వవిద్యాలయ కళాశాలలో 133 మంది శిక్షణ పొందిన సెక్యూరిటీని, ఆరుగురు సెక్యూరిటీ పర్యవేక్షకులను, ప్రారంభంలో 11 నెలల కాలానికి నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్టు తెలిపారు. సెక్యూరిటీ సంస్థ ఎంపికను టెండర్ ప్రక్రియ ద్వారా, విశ్వవిద్యాలయ కమిటీ ఎంపిక చేసినట్టు ఆయన పేర్కొన్నారు. దీనికి సంబంధించిన ఆర్డర్ ను రిజిస్ట్రార్ ఆ సెక్యూరిటీ సంస్థ ప్రతినిధులకు అందజేశారు. రిజిస్ట్రార్ తో పాటు అభివృద్ధి అధికారి ఆచార్య ఎన్.వాసుదేవ రెడ్డి, ఫైనాన్సు ఆఫీసర్ తోట రాజయ్య, సహాయ రిజిస్ట్రార్ సీహెచ్ ప్రణయ కుమార్, సూపరింటెండెంట్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరూ బాధ్యతగా చెట్లు పెంచాలి

## గ్లోబల్ మెడ్ లా సంస్థ ఫౌండర్ మట్టేపెల్లి అభిషేక్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** సమాజ శ్రేయస్సుకై ప్రతి పౌరుడు బాధ్యతగా చెట్లు పెంచాలని గ్లోబల్ మెడ్ లా సంస్థ ఫౌండర్ ప్రెసిడెంట్ మట్టేపెల్లి అభిషేక్ అన్నారు. శుక్రవారం హనుమకొండలోని అంబేద్కర్ భవన్ లో జరిగిన ఆదర్శ లా కాలేజీ ఎఫ్-3 ఫెస్ట్ కార్యక్రమంలో సేవ్ నేచర్-సేవ్ ఫ్యూచర్ నినాదంతో మొక్కలు పెంచడం అందరు అలవాటు చేసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా న్యాయమూర్తి సీహెచ్ రమేష్ బాబు సంస్థ లోగోను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్లోబల్ మెడ్ లా సంస్థ ద్వారా ప్రతి పౌరుడిని మేల్కొపుతామన్నారు. రానున్న రోజుల్లో ప్రతి గ్రామంలో మెడికల్, న్యాయ అవగాహన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో లా కాలేజ్ చైర్మెన్ బూర విద్యాసాగర్, బార్అసోసియేషన్ ప్రెసిడెంట్ మాతంగి రమేష్ బాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఫార్మసీ విభాగంలో అరుణకు డాక్టరేట్



**వరంగల్ వాయిస్, కేయూ :** కాకతీయ విశ్వవిద్యాలయ ఫార్మసీ విభాగ పరిశోధకురాలు జి.అరుణకు విశ్వవిద్యాలయ పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య ఎస్.నరసింహ చారి డాక్తోరాటే ప్రకటించారు. డాక్టర్ జి.అరుణ "డిజైన్ , సింతేసిస్ అండ్ ఇవాల్యుయేషన్ అఫ్ బెంజోతీయజోలు అండ్ ఇండోలు , బేస్డ్ హేతేరోసైక్లిక్ ఏజెంట్స్ అండ్ థర్ అనాలాగ్స్ ఫర్ ఏంటిమైక్రోబియల్ , ఏంటిట్యూబర్కులర్ అండ్ యాంటీ క్యాన్సర్ ఆక్టివిటీస్ " అనే అంశంపై విభాగ విశ్రాంత ఆచార్యులు ఆచార్య జి.అచ్చయ్య పర్యవేక్షణలో అధ్యయణ పూర్తి చేశారు. హైదరాబాద్ కు చెందిన డాక్టర్ జి.అరుణ ప్రస్తుతం హైదరాబాద్ లోని జ్ఞానజ్యోతి ఫార్మసీ కాలేజీలో అసిస్టెంట్ ప్రొఫెసర్ గా పని చేస్తున్నారు. పలువురు బోధనా, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు డాక్టర్ జి.అరుణను అభినందించారు.

# జీపీ సిబ్బంది భిక్షాటన



**వరంగల్ వాయ్యిస్, పర్వతగిరి :** మండలంలోని 33 గ్రామపంచాయతీల సిబ్బంది తమ న్యాయమైన కోరికలు నెరవేర్చాలని మండల కేంద్రంలో భిక్షాటన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల గ్రామ పంచాయితీ సిబ్బంది మండల కమిటీ అధ్యక్షుడు నకరికంటి రామచందర్ మాట్లాడుతూ జీవో 51ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఇంటింటా భిక్షాటన కార్యక్రమాన్ని చేస్తూ నిరసన వ్యక్తం చేసినట్లు తెలిపారు. అదేవిధంగా సిబ్బందిని పర్మినెంట్ చేసి రూ.26000 జీతం చెల్లించాలని, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలను కూడా అందే విధంగా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు వడ్డే కుమార్, ఈదుల వెంకన్న, చీదురు రజిని, బాబు, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

# నర్సక్కపల్లిలో స్వచ్ఛ అంగన్వాడీ



**వరంగల్ వాయిస్, నడికూడ :** మండలంలోని నర్సక్కపల్లి గ్రామంలోఅంబేద్కర్ కాలనీ అంగన్వాడీ కేంద్రం- 2 పరిధిలో అమ్మ మాట అంగన్వాడి బాట కార్యక్రమంలో భాగంగా ఈరోజు స్వచ్ఛ అంగన్వాడీ పేరిట అంగన్వాడి కేంద్రాన్ని శుభ్రపరిచి సెంటర్ ఆవరణలో కిచెన్ గార్డెన్ కు సంబంధించి కొన్ని కూరగాయల చెట్లు నాటడం జరిగింది. పిల్లలకు స్నేహ పూర్వక వాతావరణం కలిగించేలా కేంద్రాన్ని ఏర్పాటు చేయుటకై ఈ కార్యక్రమాలను చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ కోడెపాక సుప్రియ, ఆయా జన్ను వనజ, ఆశ వర్కర్ కొడెపాక కోమల, తల్లులు, పిల్లలు పాల్గొన్నారు.

# రైతులకు ఇచ్చిన మాటను నెరవేర్చిన ప్రభుత్వం

## యూత్ కాంగ్రెస్ నేత కల్లూరి పవన్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన మాట ప్రకారం రుణమాఫీ చేయడం సందర్భంగా యూత్ కాంగ్రెస్ నాయకులు కల్లూరి పవన్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం పవన్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ఎన్నికల హామీలలో భాగంగా కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని చెప్పిన రేవంత్ రెడ్డి మాట ప్రకారం ఆగష్టు 15 నాటికీ రైతులకు రుణమాఫీ చేస్తామని చెప్పిన ప్రకారంగానే చేయడం జరిగిందన్నారు. రైతులకు న్యాయం చేసే పార్టీ కేవలం కాంగ్రెస్ పార్టీ అని హరీష్ రావు రాజీనామా చేస్తానన్న మాటకు కట్టుబడి ఉండాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా తప్పుడు ప్రచారాలు మానుకోవాలని హితవు పలికారు.

# ముదిరాజుల సమస్యలు పరిష్కరించాలి



**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** ఎన్నో ఏండ్లుగా అపరిష్కృతంగా ఉన్న ముదిరాజుల సమస్యలను పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపాలని ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గొడుగు శ్రీనివాస్, రాష్ట్ర కార్యదర్శి నీలం దుర్గేష్, జిల్లా ఉపాధ్యక్షుడు మారబోయిన రామభద్రం, జిల్లా ఫిషరీష్ చీప్ ప్రమోటర్ కొత్తూరు రమేష్ డిమాండ్ చేశారు. డోర్నకల్ మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించి తహసాల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. తెలంగాణ వ్యాప్తంగా సుమారు 60 లక్షల మంది ముదిరాజులు ఉన్నారని, జనాభా ప్రాతిపదికన జిల్లాకు ఒక కార్పొరేషన్ పదవి ఇవ్వాలిని డిమాండ్ చేశారు. ముదిరాజులను బీసీ-డీ నుంచి ఏ రిజర్వేషన్ సౌకర్యం కల్పించాలని, ఫైనాన్స్ కార్పొరేషన్ లో వెయ్యి కోట్ల నిధులను ముదిరాజులకే కేటాయించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలో అత్యధిక కలిగిన ఉన్నప్పటికీ విద్య, ఉద్యోగాలలో చట్ట బద్ధంగా రావాల్సిన వాటా కోసం పోరాటం చేసేందుకు ముదిరాజులు ఐక్యంగా ఉండాలని సూచించారు. సుప్రీంకోర్టు టీబీసీ కమిషన్ వేసి నివేదిక సమర్పించాల్సిందిగా గత 5 సంవత్సరాల నుంచి తెలంగాణ ప్రభుత్వాన్ని కోరిందని కానీ, బీసీ కమిషన్, తెలంగాణ ప్రభుత్వం తాత్సారం చేస్తూ అన్యాయం చేస్తున్నారన్నారన్నారు. సుప్రీంకోర్టులో ముదిరాజులకు అన్యాయం జరుగకుండా రాష్ట్ర ప్రభుత్వం చూడాలని కోరారు. చెరువుల విస్తీర్ణంతో సంబంధం లేకుండా 18 సంవత్సరాలు నిండిన ప్రతి మత్స్యకారులకు సభ్యత్వం కల్పించాలని డిమాండ్ చేశారు. మండలాధ్యక్షుడు నీలం కృష్ణ, ఉపాధ్యక్షుడు రెడ్డబోయిన శంకర్, పట్టణాధ్యక్షుడు మామిడి రామ్మూర్తి, కార్యదర్శి శ్రీనివాస్, రమణబోయిన రాజు, గుండా వెంకన్న, నవీన్, గోపి, వీరన్న, ఆంజనేయులు, సురేష్, లింగన్న, కన్నయ్య, కోటేశ్వరరావు, నాగరాజు, మోహన్ రావ్, నరసయ్య, సైదులు, మహేష్, మధు, భాస్కర్, కేశవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

# ఆగస్టు 1 నుంచి వికలాంగులకు చేయూత

## వికలాంగుల కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ ముత్తినేని వీరయ్య



**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** 'వికలాంగులకి చేయూత' పేరుతో ఆగస్ట్ 1 నుంచి ప్రత్యేక గ్రీవెన్స్ ను ఏర్పాటు చేయనున్నట్లు వికలాంగుల ఫైనాన్స్ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ ముత్తినేని వీరయ్య తెలిపారు. శుక్రవారం హైదరాబాద్ మలక్ పేటలోని వికలాంగుల సంక్షేమ, సహకార రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పంచాయతీ రాజ్, మహిళా, శిశు సంక్షేమ, వికలాంగుల శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ, సీతక్క చేతుల మీదుగా వికలాంగులకు చేయూత గ్రీవెన్స్ కార్యక్రమాన్ని ప్రారంభం చేస్తున్నట్లు ఆయన తెలిపారు. నెలలో 1వ, 3వ గురువారాల్లో రాష్ట్ర వికలాంగుల సంక్షేమ శాఖ కార్యాలయం మలక్ పేటలో గ్రీవెన్స్ నిర్వహణ చేయబడుతుందని, ప్రతి నెల 2వ, 4వ గురువారాల్లో డయల్ యువర్ చైర్మన్ పేరుతో గ్రీవెన్స్ (100 శాతం వైకల్యం ఉన్న వ్యక్తుల కోసం) నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. గత 10 ఏండ్లలో నిర్లక్ష్యం చేయబడిన వికలాంగుల సమస్యలను తెలుసుకొని పరిష్కారం చేయడం కోసం ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుందని, ఈ కార్యక్రమంతో వికలాంగుల జీవితాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించి, వారికి భరోసా కల్పించి వారి జీవితాల్లో వెలుగులు నింపి వారికి అండగా ఉండి ముందుకు నడిపించడమే తెలంగాణ ప్రభుత్వం ముఖ్య ఉద్దేశమని ఆయన అన్నారు. ఇది దేశంలోనే చారిత్రాత్మక ముందడుగుగా నిలుస్తుందని, గత బీఆర్ఎస్ ప్రభుత్వం వికలాంగుల సమస్యలపై నిర్లక్ష్యం వహించిందని, దాన్ని ప్రక్షాళన చేయడానికే ఈ నిర్ణయం తీసుకున్నామని ఆయన తెలిపారు. అట్టడుగు వర్గాల అభివృద్ధి, నిస్సహాయుల అభివృద్దే నిజమైన ప్రజా పాలనని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించిన ప్రజా పాలనలో భాగంగా వికలాంగుల సర్వతోముఖాభివృద్ధికి తోడ్పడే పథకాలను రచించి అమలుపరుస్తామని అన్నారు

# స్థానిక సంస్థల ఎన్నికల్లో లబ్ధి పొందేందుకే రుణమాఫీ డ్రామా

## బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రాదారపు శివకుమార్



**వరంగల్ వాయిస్, వరంగల్ :** తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి నుంచి మంత్రుల వరకు, ఎమ్మెల్యేల నుంచి కార్యకర్తల వరకు కాంగ్రెస్ నేతలు, కాంగ్రెస్ నాయకులు ఏమి సాధించారని, తెలంగాణకు ఏమీ ఒరగబెట్టారని తెలంగాణ వ్యాప్తంగా సంబరాలు చేసుకుంటున్నారని బీజేపీ వరంగల్ జిల్లా ఉపాధ్యక్షుడు రాదారపు శివకుమార్ మండిపడ్డారు. రైతు రుణమాఫీలో రైతులను మోసం చేసినందుకా, ఖరీఫ్ ప్రారంభమై ఇన్ని రోజులైనా రైతులకు, కౌలు రైతులకు రైతు భరోసా ఎగ్గొట్టినందుకా, వరి ధాన్యానికి రైతులకు కనీస మద్దతు ధరపై 500 బోనస్ ఎగ్గొట్టినందుకా ఈ సంబరాలని ప్రశ్నించారు. ముమ్మాటికి జడ్పీటీసీ, ఎంపీటీసీ, స్థానిక సంస్థల ఎన్నికల్లో లబ్ధి పొందేందుకే ఈ రైతు రుణమాఫీ డ్రామా ఆడుతున్నారని అన్నారు. మూలిగే నక్కపై తాటిపండు పడ్డ చందంగా తెలంగాణ రాష్ట్రంలో రైతులు, రైతు కూలీల పరిస్థితి అగమ్యగోచరంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతు రుణమాఫీ ఒకేసారి రూ. 2 లక్షలు చేస్తానని చెప్పిన ముఖ్యమంత్రి ఫస్ట్ విడత లక్ష రూపాయల లోపు చేయడం ఏందని విమర్శించారు. మీరు ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను తూచా తప్పకుండా ఎలాంటి కొరివిలు పెట్టకుండా అమలు చేసి స్థానిక సంస్థల ఎన్నికల్లో తెలంగాణ ప్రజలను, రైతులను, రైతు కూలీలను ఓట్లు అడగాలన్నారు. లేనిపక్షంలో తెలంగాణ ప్రజలు, రైతులు, రైతు కూలీలు కర్రు కాల్చి వాత పెట్టడం ఖాయమని కాంగ్రెస్ ప్రభుత్వం పై నిప్పులు చెరిగారు.

# రైతు నేస్తం..కాంగ్రెస్ ప్రభుత్వం



**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** రాష్ట్ర ప్రభుత్వం రెండు లక్షల రుణమాఫీ చేసిన సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి, ప్రభుత్వ విఫ్, డోర్నకల్ నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ రాంచంద్రు నాయక్ చిత్రపటానికి గిరిజనులు పాలాభిషేకం చేశారు. గుర్రాలకుంట గ్రామపంచాయతీలో మండల గిరజన నాయకులు మాలోత్ బాసింగ్, ఇస్లావత్ శ్రీనివాస్ నాయక్, ఇస్లావత్ రాంబాబు, వినోద్, రెడ్యానాయక్ మాన్సింగ్ నాయక్ తదితరులు పాలభిషేకం చేశారు. 1970లో గిరిజనుల సంక్షేమం కోసం కాంగ్రెస్ పార్టీ 1/70 యాక్ట్ తీసుకోచ్చారని గుర్తు చేశారు. 2022 మే 6న వరంగల్ డిక్లరేషన్ ద్వారా కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ రైతులకు 2లక్షలు రుణమాఫీ చేస్తామని రైతులకు ఇచ్చిన మాట ప్రకారం రాష్ట్రంలోని రైతులందరికీ రెండు లక్షల రుణమాఫీ చేస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చరిత్ర సృష్టించబోతున్నారన్నారు. దేశ చరిత్రలో ఒకేసారి 31 వేల కోట్ల రైతురుణమాఫీ చేసిన రికార్డు కాంగ్రెస్ ప్రభుత్వం సొంతం చేసుకుందన్నారు. రుణమాఫీపై గ్రామ, మండల స్థాయిలలో సమావేశాలు నిర్వహించి ప్రభుత్వ గొప్పతనాన్ని వివరించాలన్నారు.

# బీజేపీ ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం చేయాలి

## సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్




**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** సీపీఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో పట్టణ కమిటీ సభ్యులు శాఖ కార్యదర్శులతో విస్తృత సమావేశం కుమ్మరి కుంట్ల నాగన్న అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్ పాల్గొని మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయకపోగా ప్రైవేటీకరణ పేరుతో ప్రభుత్వ రంగ సంస్థలు రైల్వే బ్యాంకింగ్ ఎల్ఐసీ, బీఎస్ఎన్ఎల్, బొగ్గు గనులు, స్టీల్ మిగతా వాటిని కూడా కారు చౌకగా కార్పొరేట్లకు కట్టబెడుతుంది. సామాన్య జనంపై కక్షగట్టినట్లుగా ప్రజలు వాడే ప్రతి వస్తువు ధరను పెంచుతుంది. ఉప్పు, పప్పు, నూనెలు తదితర సరుకుల రిటైల్ ధరలన్నీ సుమారు 50 నుంచి 60 శాతం పెంచింది. విద్య, వైద్య ఖర్చులు కూడా విపరీతంగా పెరిగాయి. గృహ వినియోగ సిలిండర్ ధరలు రూ.500 నుంచి 1150 వరకు పెంచిన ఘనత బీజేపీ ప్రభుత్వాదన్నారు. రాష్ట్రంలో అత్యధికంగా గిరిజనులు ఉన్న మానుకోట జిల్లా ఇది అన్ని రంగాల్లో వెనుకబడి ఉంది. జిల్లాలో ఒక భారీ పరిశ్రమ లేదు. విభజన చట్టంలో ఇచ్చిన హామీ ప్రకారం బయ్యారం ఉక్కు పరిశ్రమ ఏర్పాటులో కేంద్ర బీజేపీ ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుంది. విద్య వైద్యాన్ని మరింత అభివృద్ధి చేయాలని, గిరిజన యూనివర్సిటీ, వ్యవసాయ కళాశాలను ఏర్పాటు చేయాలని, పోడు వ్యవసాయం చేస్తున్న రైతులందరికీ వెంటనే పట్టాలు ఇవ్వాలని, జిల్లా కేంద్రంలో రింగురోడ్డును ఏర్పాటు చేయాలని, ఇండస్ట్రియల్ పార్కు అండర్ డ్రైనేజీ మరొక రైల్వే ఓవర్ బ్రిడ్జి ప్రభుత్వ ఆధ్వర్యంలో కోల్డ్ స్టోరేజీలు, పేదలు వేసుకున్న గుడిసెలకు పట్టాలు ఇవ్వాలని, బీజేపీ మతోన్మాద విధానాలను ఎండగట్టడం కోసం పెద్ద ఎత్తున ఆందోళన పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు సుర్ణపు సోమయ్య, జిల్లా కమిటీ సభ్యులు సమ్మెట రాజమౌళి, పట్టణ కార్యదర్శి బానోతు సీతారాం నాయక్, అల్లి శ్రీనివాస్ రెడ్డి, రావుల రాజు, చీపిరి యాకయ్య, హేమ నాయక్, గౌని వెంకన్న, చాగంటి భాగ్యమ్మ, తోట శ్రీనివాస్, యమగాని వెంకన్న, ఎస్కే తాజ్జు, శాఖ కార్యదర్శులు, ప్రజా సంఘాల బాధ్యులు పాల్గొన్నారు.

# సిరిసిల్ల రాజయ్యను సన్మానించిన దేవేందర్ గౌడ్



**వరంగల్ వాయిస్, నడికూడ :** తెలంగాణ స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య శుక్రవారం పరకాల పట్టణానికి వచ్చిన సందర్భంగా ఆయన్ని నడికూడ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బుర్ర దేవేందర్ గౌడ్ మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు ఆముదాల పెళ్లి మల్లేష్ గౌడ్ పాల్గొన్నారు.

# మాజీ జడ్పీటీసీకి పరామర్శ



**వరంగల్ వాయిస్, నడికూడ :** అనారోగ్యంతో బాధపడుతూ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మాజీ జడ్పీటీసీ సభ్యుడు బోల్లపల్లి భిక్షపతిని శుక్రవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు, మండల మాజీ అధ్యక్షుడు పర్ణం తిరుపతిరెడ్డి పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని మనో ధైర్యం నింపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు పాడి ప్రతాపరెడ్డి, మాజీ డీసీసీబీ డైరెక్టర్ చింతరెడ్డి సాంబ రెడ్డి పాల్గొన్నారు.

# జంగా రాఘవరెడ్డిని కలిసిన ఏఐజీడీఎస్, రైల్వే కార్మిక నేతలు



**వరంగల్ వాయిస్, కాజీపేట :** తెలంగాణ రాష్ట్ర ఆయిల్ సీడ్స్ అండ్ గ్రోవర్స్ ఫెడరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డిని శుక్రవారం ఉదయం ఆయన నివాసంలో రైల్వే కార్మిక ఉద్యమ నేత, కాజీపేట రైల్వే డివిజన్ కోచ్ ఫ్యాక్టరీ సాధన సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు, ఏఐఆర్ఆర్ఎఫ్ వర్కింగ్ ప్రెసిడెంట్ కర్ర యాదవ రెడ్డి, అఖిలభారత గ్రామీణ తపాల ఉద్యోగుల సంఘం జాతీయ అధ్యక్షుడు బొద్దున వెంకటేశ్వర్లు, ఎస్సీ, ఎస్టీ రైల్వే ఎంప్లాయిస్ అసోసియేషన్ నేత కురుసపల్లి రవీందర్, ఏఐజీడిఎస్ నాయకులు మర్రి కుమురారెడ్డి, పిట్టల అశోక్ తదితరులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల ఫెడరేషన్ చైర్మన్ గా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా జంగా రాఘవరెడ్డికి పుష్పగుచ్చం అందించి శాలువాతో ఘనంగా సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఏఐజీడీఎస్ జాతీయ అధ్యక్షుడు బొద్దున వెంకటేశ్వర్లు మాట్లాడుతూ నిరంతరం ప్రజా సంక్షేమం కోసం పాటుపడే జంగా రాఘవరెడ్డికి ప్రభుత్వం ఫెడరేషన్ చైర్మన్ గా పదవీ బాధ్యతలు అప్పగించడం సంతోషంగా ఉందన్నారు. కాజీపేటలో నిర్వహించిన అఖిల భారత గ్రామీణ తపాల ఉద్యోగుల సంఘం జాతీయ మహాసభలకు జంగా రాఘవరెడ్డి రెడ్డి ఎంతో సహకరించారని పేర్కొన్నారు. ముందు ముందు ఆయన మరెన్నో ఉన్నతమైన పదవులు చేపట్టాలని ఆకాంక్షించారు.

# టీచర్ల పెండింగ్ బిల్లులు క్లియర్ చేయాలి

## టీఎస్ యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ యాకూబ్



**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** టీఎస్ యూటీఎఫ్ కురవి మండల కమిటీ ఆధ్వర్యంలో మండలంలో కేజీబీవీ, నేరడ, తట్టుపల్లి, కురవి పాఠశాలల్లో యూటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఈ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ యాకూబ్ హాజరై మాట్లాడుతూ కేజీబీవీ పాఠశాలలకు వార్షిక బడ్జెట్ ను వెంటనే విడుదల చేయాలని, పాఠశాలలకు ట్యాబ్ లు ఇవ్వాలని, కేజీబివి పాఠశాలలను అమ్మ ఆదర్శ పాఠశాలలో ఎంపిక చేసి అభివృద్ధి పనులు చేపట్టాలని, కేజీబీవీ టీచర్లు, సిబ్బందిని రెగ్యులర్ చేయాలని, కేర్ టేకర్లను నియమించి పెండింగ్ డీఏలను, బిల్లులను క్లియర్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి కె రాజశేఖర్, బాలరాజు, అష్మాత్ పాషా తదితరులు పాల్గొన్నారు.

# ఎన్‌హెచ్ఎం ఉద్యోగులకు న్యాయం చేయాలి



**వరంగల్ వాయిస్, వరంగల్ :** ఎన్ హెచ్ఎం ఉద్యోగులను 510 జీవోలో భాగంగా 4000 మందికి జీవో సవరణ చేసి ఉద్యోగులకు న్యాయం చేయాలని ఎన్ హెచ్ఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా డిమాండ్ చేశారు. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహాను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ త్వరలోనే 4000 కుటుంబాల జీవితాలలో వెలుగులు నింపుతామని, జీవో 510 వెంటనే రిలీజ్ చేయాలని చెప్పారు. ప్రభుత్వ అధికారులతో ప్రతి ఒక్కరికి ఒక క్యాడర్ ఫిక్స్ చేసి క్యాడర్ వారీగా ఎంత వేతనం ఇవ్వాలో నూతన కమిటీతో శ్రీకారం చుడుతామని మంత్రి పేర్కొన్నారు. సమాన పనికి సమాన వేతనం కూడా త్వరలో ఇస్తామన్నారు. ఇప్పటి వరకు జాతీయ ఆరోగ్య మిషన్ లో ఉద్యోగులను రెగ్యులరైజేషన్ చేసిన మణిపూర్, హిమాచల్ ప్రదేశ్, మహారాష్ట్ర, జార?ండ్ , ప్రభుత్వాలను దృష్టిలో పెట్టుకొని తెలంగాణ రాష్ట్రంలో పనిచేస్తున్న జాతీయ ఆరోగ్య మిషన్ కాంట్రాక్ట్ అండ్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులందరిని కూడా రెగ్యులరైజ్ చేయాలని రామ రాజేష్ ఖన్నా మంత్రిని కోరారు.

# అప్రెంటిషిప్ జాబ్ మేళా-24కు అనూహ్య స్పందన



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** తెలంగాణ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ డైరెక్టర్, ఆర్డీఎస్డీఈ (రీజినల్ డైరెక్టర్ ఆఫ్ స్కిల్ డెవలప్మెంట్ అండ్ ఎంట్రపీన్యూయర్షిప్, గవర్నమెంట్ ఆఫ్ ఇండియా) వారి ఆధ్వర్యంలో సంయుక్తంగా నిర్వహించిన జాబ్ మేళా-2024కు అనూహ్య స్పందన లభించింది. ఈ జాబ్ మేళాకు ప్రముఖ ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల నుంచి 12 మంది ప్రతినిధులు పాల్గొని 200 మంది అభ్యర్థులను అప్రెంటిషిప్ జాబ్ మేళా- 24కు ఇంటర్మీడియట్ ఒకేషనల్ కోర్సులు 2021-2024 వరకు పూర్తి చేసిన అభ్యర్థులను అప్రెంటిషిప్ కు ఎంపిక చేసుకోవడం జరిగింది. ఈ జాబ్ మేళా ప్రారంభోత్సవ సమావేశానికి ప్రభుత్వ వృత్తివిద్యా జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ బెడదం శ్రీనివాస్ అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా ఆర్డీఎస్డీఈ ట్రైనింగ్ ఆఫీసర్ కె.విజయకుమార్ హాజరై మాట్లాడుతూ ఇంటర్మీడియట్ స్థాయిలో ఒకేషనల్ కోర్సులు పూర్తిచేసిన అభ్యర్థులకు ఉపాధి అవకాశాలు మెండుగా ఉన్నాయన్నారు. అప్రెంటీస్ కాలంలో విద్యార్థులకు ప్రోత్సాహకంగా కేంద్ర ప్రభుత్వ సాంకేతిక శిక్షణ నైపుణ్య సంస్థ ద్వారా రూ.7000 నెలకు ఉపకార వేతనంగా శిక్షణ కాలం పూర్తయ్యే వరకు చెల్లిస్తామని తెలిపారు. వృత్తి విద్యా కోర్సులను పూర్తిచేసిన అభ్యర్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉందని తెలియజేశారు. అనంతరం విశిష్ట అతిథిగా విచ్చేసిన బి.రమేష్, రీడర్, స్టేట్ ఇన్ స్టిట్యూట్ ఆఫ్ ఒకేషనల్ ఎడ్యుకేషన్, మాట్లాడుతూ విద్యార్థులందరూ ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో ఉపాధి అవకాశాలు పొందాలని పిలుపునిచ్చారు. జాబ్ మేళా కన్వీనర్ హనుమకొండ జిల్లా ఇంటర్ విద్యాధికారి ఏ.గోపాల్ మాట్లాడుతూ ఇంటర్మీడియట్ స్థాయిలోనే విద్యార్థులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించడంలో ఇలాంటి జాబ్ మేళాలు ఎంతగానో తోడ్పడతాయన్నారు. ఈ కార్యక్రమంలో అప్రెంటిషిప్ మేళా కో-కన్వీనర్ కె.మాధవరావు, నోడల్ ఆఫీసర్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్, వరంగల్ జిల్లా, జనగాం జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి శాగంటి శ్రీనివాస్, ఎస్.ధర్మేంద్ర ప్రిన్సిపాల్, ప్రభుత్వ జూనియర్ కళాశాల హనుమకొండ, పి.దివాకర్ రిటైర్ ప్రిన్సిపల్, ప్రభుత్వ వృత్తివిద్యా జూనియర్ కళాశాల, హనుమకొండ, ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రాం అధికారులు డాక్టర్.ఆర్.ప్రవీణ్ కుమార్, డాక్టర్.సవ్వాసి శ్రీనివాస్, అధ్యాపకులు ఏం.విష్ణుకాంత్, ఎం.రాజేంద్రప్రసాద్, బి.శంకర్, పి.విజయ్ కుమార్, చౌహన్, ఖాదర్ బాబా, డి.రవి, ఎం.సమ్మయ్య, ఏ.దిలీప్, కె.రేణుక, పరమేశ్వరి, జయపాల్, భిక్షం, మహేందర్ అధ్యాపకేతర బృందం, వివిధ సంస్థల ప్రతినిధులు, విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయుల సేవలు మరువలేనివి

## ఎంపీడీవో షేక్ సిలార్ సాహెబ్



**వరంగల్ వాయిస్, తొర్రూరు :** దశాబ్ద కాలంగా పేద, బడుగు విద్యార్థుల అభివృద్ధి కోసం అంకితభావంతో పనిచేసిన కవిత, హరిత ఉపాధ్యాయుల సేవలు మరువలేనివని తొర్రూరు ఎంపీడీవో షేక్ సిలార్ సాహెబ్ అన్నారు. ఆయన కవిత, హరిత బదిలీ వీడ్కోలు సన్మాన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో భాగంగా వీడ్కోలు పొందిన ఉపాధ్యాయులను శాలువా, జ్ఞాపిక, పూలమాల, సన్మాన పత్రంతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు విమలాదేవి, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ ఎల్లమ్మ, ఉపాధ్యాయులు స్వాతి, కరుణాకర్, భీమా, శ్రీనివాస్ లతో పాటుగా గ్రామ పెద్దలు సుధాకర్, షేక్ అంకూస్, అంజయ్య, వినోద్, సకినా, రాజు, శేఖర్, కేతమ్మ, జ్యోతి, పద్మ ఎల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

# నితిన్ రాబిన్ హుడ్‌లో రాజేంద్రప్రసాద్






టాలీవుడ్ యాక్టర్ నితిన్ నటిస్తోన్న సినిమాల్లో ఒకటి రాబిన్‌హుడ్. వెంకీ కుడుముల దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో శ్రీలీల ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. లేడీ బాస్ శ్రీలీల స్టైలిష్ అవతార్‌లో హ్యాండ్ బ్యాగ్ వేసుకుని విమానంలో నుంచి దిగుతున్న స్టిల్ నెట్టింట వైరల్ అవుతోంది. ఈ మూవీలో నటకిరిటీ రాజేంద్రప్రసాద్ కీలక పాత్రలో నటిస్తున్న విషయం తెలిసిందే. తాజాగా నటకిరీటికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేస్తూ.. ఆయన లుక్ షేర్ చేశారు. ఇందులో ఏజెంట్ జాన్ స్నోగా కనిపించబోతున్నట్టు తెలియజేస్తూ రిలీజ్ చేసిన స్టైలిష్ లుక్ నెట్టింట వైరల్ అవుతోంది. ఇప్పటికే డబ్బు చాలా చెడ్డది.. రూపాయి రూపాయి నువ్వేం చేస్తావే అంటే అన్నదమ్ములు, అక్కాచె÷-లలెళ్ల మధ్య చిచ్చు పెడతానంటది. అన్నట్టే చేసింది.. దేశమంత కుటుంబం నాది. ఆస్తులున్నోళ్లంతా నా అన్నదమ్ముళ్లు. ఆభరణాలు వేసుకున్నోళ్లంతా నా అక్కాచెలలెళ్లు. అవసరం కొద్దీ వాళ్ల జేబుల్లో చేతులు పెడితే ఫ్యామిలీ మెంబర్ అని కూడా చూడకుండా నా మీద కేసులు పెడుతున్నారు.. అంటూ గ్లింప్స్ వీడియోలో నితిన్ చెప్పే డైలాగ్స్ సినిమాపై క్యూరియాసిటీ పెంచుతున్నాయి. ఈ మూవీలో నితిన్ దొంగగా సరికొత్త అవతారంలో కనిపించబోతుండగా వెన్నెల కిశోర్ కీ రోల్‌లో నటిస్తున్నారు. ఈ మూవీని మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై నవీన్ యేర్నేని, రవి శంకర్ నిర్మి?స్తున్నారు. జీవీ ప్రకాశ్ కుమార్ మ్యూజిక్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు.

## ప్రభాస్‌తో.. అను రాఘవపూడి

### ఫౌజీని తెరకెకకించే యత్నాలు

టాలీవుడ్‌లో ప్రస్తుతం బిజీగా ఉన్న హీరో అంటే పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ అని చెప్పక తప్పదు. ఏడాదికి రెండు సినిమాలను విడుదల చేస్తున్నాడు ఈ స్టార్ హీరో. ప్రస్తుతం ప్రభాస్ చేతిలో సలార్ 2తో పాటు కల్కి పార్ట్, రాజా సాబ్, స్పిరిట్ చిత్రాలు ఉన్నాయి. ఈ సినిమాలు షూటింగ్ కంప్లీట్ చేయడానికి కనీసం ఇంకో సంవత్సరం అయిన పడుతుంది. అయితే ఈ సినిమాలతో పాటు ప్రభాస్ మరో టాలీవుడ్ దర్శకుడికి ఒకే చెప్పిన విషయం తెలిసిందే, పడి పడి లేచే మనసు, సీతారామం, అందాల రాక్షసి చిత్రాల ఫేమ్ హను రాఘవపూడితో 'ఫౌజీ' అనే మూవీ ఒకే చేశాడు ప్రభాస్. ఈ సినిమా ప్రస్తుతం పోస్ట్ ప్రోడక్షన్ పనుల్లో బిజీగా ఉండగా.. ఈ సినిమా అక్టోబర్ చివరి వారంలో లేదా, నవంబర్‌లో షూటింగ్ మొదలు పెట్టనున్నట్లు తెలుస్తుంది. యానిమల్ దర్శకుడు సందీప్ రెడ్డి వంగా ప్రభాస్ కాంబోలో వస్తున్న చిత్రం 'స్పిరిట్'. ఈ సినిమాను మొదట 2024 చివరిలో షూటింగ్ ప్రారభించనున్నట్లు చిత్ర దర్శకుడు ప్రకటించాడు. అయితే 'స్పిరిట్' ప్రీ ప్రొడక్షన్ పనులకు మరింత సమయం



పడుతుందని తెలుస్తుంది. దీంతో ఈ ప్రాజెక్ట్ ఆలస్యం అవుతుండడంతో ఆ స్థానంలో ఫౌజీ' సెట్స్‌పైకి వెళ్లనున్నట్లు తెలుస్తోంది. ప్రతిష్టాత్మక మైత్రీమూవీమేకర్స్ నిర్మించనున్న ఈ సినిమాకు 'ఫౌజీ' అనే టైటిల్ అనుకుంటునట్టు తెలుస్తున్నది. ఫౌజీ అంటే సైనికుడు అని అర్థం. ఈ సినిమాలో ప్రభాస్ సైనికుడిగా కనిపించనున్నారట. అందుకే ఈ టైటిల్ బావుంటుందని బృందం భావిస్తున్నది. స్వాతంత్యానికి పూర్వం జరిగే కథతో దర్శకుడు అను రాఘవపూడి ఈ సినిమాను తెరకెక్కించనున్నారట. బ్రిటీష్‌వారి సైనికుడిగా ఇందులో ప్రభాస్ కనిపించనున్నారట. ఇందులో కథానాయికగా మృణాళ్‌ఠాకూర్ ఖరారైనట్టు వార్తలు వస్తున్నాయి. విశాల్ చంద్రశేఖర్ ఈ సినిమాకు బాణీలు సమకూరుస్తున్నారు.

## డార్లింగ్ కోసం ప్రియదర్శి పాట్లు



ఓవైపు హాస్య నటుడిగా సినీప్రియుల్ని నవ్విస్తూనే.. 'మల్లేశం', 'బలగం' వంటి విజయవంతమైన సినిమాలతో హీరోగానూ సత్తా చాటారు ప్రియదర్శి. ఇప్పుడాయన.. నభా నటేశ్‌కు జోడీగా నటించిన చిత్రమే డార్లింగ్. అశ్విన్ రామ్ తెరకెక్కించిన ఈ సినిమా విడుదలకు ముందే పాటలు, టీజర్, ట్రైలర్లతో అందరి దృష్టినీ ఆకర్షించింది. రాఘవ (ప్రియదర్శి) ఓ ట్రావెల్ ఏజెన్సీలో ఏజెంట్. అందమైన అమ్మాయిని పెళ్లి చేసుకుని.. ఆమెతో కలిసి పారిస్‌కు హనీమూన్‌కు వెళ్లాలన్నది తన చిరకాల కోరిక. ఈ క్రమంలో తండ్రి (మురళీధర్ గౌడ్) చూసిన సైకాలజిస్ట్ నందిని (అనన్య నాగళ్ల)తో కలిసి ఏడడుగులు వేయడానికి సిద్ధపడతాడు. కానీ, ఆమె ఆఖరి నిమిషంలో ప్రేమించిన వాడితో వెళ్లిపోవడంతో.. ఆ పెళ్లి పీటలపైనే ఆగిపోతుంది. దీంతో జీవితంపై విరక్తి చెందిన రాఘవ ఆత్మహత్య చేసుకోవడానికి సిద్ధపడతాడు. సరిగ్గా అప్పుడే ఆనంది (నభా నటేష్) అతని జీవితంలోకి ప్రవేశిస్తుంది. ఆమె పరిచయమైన కొద్ది గంటల్లోనే రాఘవ ప్రపోజ్ చేయడం.. ఆ వెంటనే పెళ్లి చేసుకోవడం చకచకా జరిగిపోతాయి. కాకపోతే తొలి రాత్రి రోజే ఆనంది చేతిలో చావు దెబ్బలు తింటాడు రాఘవ. దానికి ఆమె మల్టిపుల్ స్ప్లిట్ పర్సనాలిటీ డిజార్డర్‌తో బాధ పడుతుండటమే కారణం. మరి దీనివల్ల రాఘవ ఎన్ని తిప్పలు పడ్డాడు. ఆనందిలో ఉన్న ఐదు పర్సనాలిటీస్ ఏంటి? అన్నది తెరపై చూసి తెలుసుకోవాలి. మల్టిపుల్ స్ప్లిట్ పర్సనాలిటీ డిజార్డర్ నేపథ్యంలో ఇప్పటి వరకు వచ్చిన సినిమాల్లో ఆ పాయింట్‌ను సీరియస్‌గా చూపిస్తే.. దీంట్లో మాత్రం దాన్ని వినోదాత్మకంగా చూపించే ప్రయత్నం చేశారు. భార్యతో కలిసి పారిస్‌కు హనీమూన్‌కు వెళ్లాలని కలలు కనే కుర్రాడి జీవితంలోకి అపరిచితురాల్లాంటి అమ్మాయి భార్యగా వస్తే ఏమైందనేది క్లుప్తంగా ఈ చిత్ర కథాంశం. ఆరంభంలో కథను తాను అనుకున్నట్లుగా పూర్తిగా వినోదభరితంగా చూపించడంలో పైచేయి సాధించినా.. ద్వితీయార్ధానికి వచ్చేసరికి కథను భావోద్వేగభరితంగా నడిపించాలో.. వినోదాత్మకంగా చూపించాలో అర్థం కాక దర్శకుడు తడబడినట్లు అనిపిస్తుంది. దీనికి తోడు కథానాయిక పాత్రలోని సంఘర్షణను ప్రభావవంతం గా తెరపైకి తీసుకురాలేకపోవడం.. ఆమెకున్న సమస్యను పోగొట్టడానికి హీరో చేసే ప్రయత్నాలు సిల్లీగా మరీ సినిమాటిక్‌గా ఉండటం చిత్ర ఫలితాన్ని దెబ్బతీశాయి. దీంట్లో నభా నటేష్ ఐదు భిన్నమైన కోణాలున్న పాత్రలో కనిపించింది. ఆ పాత్రల్లోని వేరియేషన్స్‌ను తనదైన నటనతో చక్కగా చూపించింది. ఆమెకు.. దర్శికి మధ్య వచ్చే ఫన్నీ సీన్స్ బాగానే వర్కవుటయ్యాయి. కానీ, తన పాత్రకు సంబంధించిన డబ్బింగ్ అంతగా కుదర్లేదనిపిస్తురది. అనన్య నాగళ్ల, మురళీధర్ గౌడ్ తదితరుల పాత్రలు పరిధి మేరకు ఉంటాయి. సుహాస్, బ్రహ్మానందం, నిహారిక కొణిదెల తదితరులు అతిథి పాత్రల్లో తళుక్కుమన్నారు.

## నాని, శ్రీకాంత్ ఓదెల కాంబో

### హీరోయిన్ జాన్వీ కపూర్ అంటూ వార్తలు







'దసరా' సినిమా కాంబోలో మరో సినిమా రాబోతున్న సంగతి తెలిసిందే. నాని, శ్రీకాంత్ ఓదెల కలిసి మరో సినిమా చేయబోతున్నారు. ఇందులో కథానాయికగా జాన్వీ కపూర్‌ని ఎంచుకొన్నట్టు వార్తలొస్తున్నాయి. చిత్రబృందం అధికారికంగా ఈ విషయంపై ఇంకా స్పందించకపోయినా జాన్వీ ఎంట్రీ దాదాపు ఖాయమేనని తెలుస్తోంది. జాన్వీకి మంచి క్రేజ్ ఉంది. తెలుగులో రెండు భారీ చిత్రాల్లో అవకాశం అందుకుంది. అయితే ఇప్పటికీ ఏదీ ప్రేక్షకుల ముందుకు రాలేదు. ప్రస్తుతం 'దేవర' షూటింగ్ తుది దశలో ఉంది. రామ్ చరణ్-బుచ్చిబాబు కాంబోలో రూపుదిద్దుకొంటున్న సినిమాలోనూ ఆమె కథానాయిక. 'పుష్ప 2'లో ఐటెమ్ సాంగ్ కోసం జాన్వీ పేరు తెరపైకి వచ్చింది. అయితే ఇప్పుడు నాని అభిమానులు మరో చర్చ లేవనెత్తారు. నాని పక్కన జాన్వీ ఏమిటన్నది నేచురల్‌స్టార్ ఫ్యాన్స్ ప్రశ్న. 'నాని అన్నా.. నీకు జాన్వీ సెట్ కాదు..' అంటూ కొంతమంది ఫ్యాన్స్ సోషల్ మీడియా వేదికగా సలహాలు ఇస్తున్నారు. జాన్వీ అక్కలా ఉంటుందని కొంతమంది సెటైర్లు విసురుతున్నారు. 'దసరాలో కీర్తి సురేష్‌తో నీ జోడీ బాగుంది కదా, తననే తీసుకోండి' అంటున్నారు. 'హాయ్ నాన్న'లో మృణాల్ విషయంలో తప్పు చేశాడన్నది నాని అభిమానుల వాదన. ఆ సినిమాలో మృణాల్‌తో నాని కెమిస్ట్రీ మిస్ మ్యాచ్ అయ్యిందని, నాని పక్కన మృణాల్ వయసు ముదిరిన పిల్లలా కనిపించిందన్న కామెంట్లు వినిపించాయి. జాన్వీ విషయంలోనూ అదే జరుగుతుందన్నది అభిమానులు బెంగపడుతున్నారు. మరి నాని నిర్ణయం ఎలా ఉంటుందో చూడాలి.



మల్లూర్ లో జలకల

# తెలంగాణలో భారీ వర్షం

## పలు జిల్లాలకు రెడ్ అలెర్ట్

## గ్రేటర్ వరంగల్‌లో కంట్రోల్ రూమ్

**వరంగల్ వాయిస్, వరంగల్ :** బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో తెలంగాణ వ్యాప్తంగా వర్షాలు దంచి కొడుతున్నాయి. రానున్న రెండు భారీ నుంచి అతి భారీ వర్షం పడే అవకాశం ఉన్నందున ములుగు, మహబూబాబాద్, ఖమ్మం, భద్రాది కొత్తగూడెం జిల్లాలకు రెడ్ అలెర్ట్ జారీ చేశారు. కరీంనగర్, భూపాలపల్లి, కొమరంభీమ్ ఆసిఫాబాద్, మంచిర్యాల, పెద్దపల్లి, వరంగల్, హనుమకొండ జిల్లాలకు ఐఎండీ ఆరెంజ్ అలెర్ట్ జారీ చేశారు. ఈ జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ హెచ్చరించింది. అవసరమైతే తప్ప బయటకు రావద్దని ప్రజలకు అధికారులు హెచ్చరికలు జారీ చేశారు.

### బల్దియాలో కంట్రోల్ రూం..

మరో మూడు వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున వరంగల్ మహా నగర పాలక సంస్థ కార్యాలయంలో కంట్రోల్ రూంను ఏర్పాటు చేశారు. దీనిని జీడబ్ల్యూఎంసీ కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాఖేడే శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అత్యవసర సమయంలో టోల్ ఫ్రీ నెంబర్ 18004251980, వాట్స్ ఆప్ నెంబర్ 7997100300, మొబైల్ నెంబర్ 9701999645 లను సంప్రదించాలని ఆమె సూచించారు. ఈ సందర్భం గా కమిషనర్ మాట్లాడుతూ వర్షాకాలం నేపథ్యంలో భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసినందున లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. వర్షానికి, వరదకు సంబంధించిన సమస్యలను మాన్సూన్ కంట్రోల్ రూమ్ కు ఫోన్ చేసి సమాచారం అందించాలన్నారు. ఫిర్యాదు అందిన వెంటనే సంబంధిత అధికారులు, డీఆర్ఎఫ్, సహాయక ప్రత్యేక బృందాలు యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకుంటారననారు. కమిషనర్ వెంట బల్దియా సెక్రెటరీ విజయలక్ష్మి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### బుర్ర వాగుపై రాకపోకల నిలిపివేత



బుర్ర వాగుపై రాకపోకల నిలిపివేత

**వరంగల్ వాయిస్, కాటారం :** కాటారం, మహాముత్తారం మండలం రహదారి మధ్యలో గల బుర్ర వాగు పై రాకపోకలు నిలిపివేసినట్లు కాటారం తహసీల్దార్ కె.నాగరాజు తెలిపారు. కాటారం మండలం పోతుల వాయి గ్రామ సమీపంలోని బుర్ర వాగు కాజువే లో లెవెల్ కల్వర్టు వద్ద ఫీటు ఎత్తుతో వరద నీటి ప్రవాహం ఉన్నందున రాకపోకలు నిలిపివేసినట్లు వివరించారు. కాటారం వైపు, మహా ముత్తారం వైపు రాకపోకలు కొనసాగించకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆయా గ్రామ పంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలు జారీ చేశారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు, ప్రయాణికులు వరద నీటి ప్రవాహంలో దాటవద్దని సూచించారు. నీటి ప్రవాహం లోతుకు వెళ్లడం, చాపలు పట్టడం ఇతరత్రా కార్యక్రమాలు ఏవి చేపట్టవద్దని తాసిల్దార్ సూచించారు.

### మానేరుకు జల కళ..

**వరంగల్ వాయిస్, మల్హర్ :** గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని పీవీ నగర్ సమీపంలోని మానేరు నది జల కళని సంతరించుకుంది. వల్లెంకుంట వద్ద మానేరు నదిపై నిర్మించిన చెక్ డ్యాం వద్ద భారీగా వర్షపు నీరు చేరడంతో చెక్ డ్యాం వద్ద ఆహ్లాదకర వాతావరణం నెలకొంది. గత కొన్ని రోజులుగా వర్షాలు లేక ఇబ్బందులు పడిన రైతులు మానేరు నది లో చెక్ డ్యాం వద్ద చేరిన నీటిని చూసి ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కొందరు రైతులు చెక్ డ్యాం వద్ద చేపలు పడుతూ సందడి చేశారు.

# గోదావరి ఉధృతి

## ప్రజలు, అధికారులు అప్రమత్తంగా ఉండాలి

## ఏటూరు నాగారంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు

## ములుగు కలెక్టర్ దివాకర టీఎస్



**వరంగల్ వాయిస్, ఏటూరునాగారం :** గోదావరిలో వరద ఉధృతి ప్రభావంతో ప్రజలు, అధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్.సూచించారు. శుక్రవారం ఏటూరునాగారం మండలంలోని రామన్నగూడెం కరకట్ట మరమ్మతు పనులను, దొడ్ల, కొండాయి బ్రిడ్జి గోదావరి వరద ఉధృతిని ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 65 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైందని, వచ్చే మూడు రోజులు భారీవర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపిన దృష్ట్యా మండల ప్రత్యేక అధికారులు, తహసిల్దార్లు, ఎంపీడీఓలు, ఎంపీఓలు, పంచాయతీ కార్యదర్శులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. గోదావరి పరివాహక ప్రాంతంలోని ఐదు మండలాల్లో 80 ముంపు ప్రాంతాలను గుర్తించామని చెరువులు వాగుల దగ్గర ఉన్నటువంటి సుమారుగా 1000 నుంచి 2000 మందిని పునరావాస కేంద్రాలకు తరలించేందుకు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశామని తెలిపారు. వరద ముంపుకు గురవుతున్న వాజేడు, వెంకటాపురం, ఏటూరునాగారం, మంగపేట, కన్నాయి గూడెం మండలాలలో 135 పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు. దీనితోపాటు సమస్యాత్మకంగా ఉన్న ప్రాంతాల్లో లక్నవరం నుంచి రెండు బోట్లను సమకూర్చుకున్నామని, అదేవిధంగా ఎన్డీఆర్ఎఫ్ టీంతో పాటు నాలుగు బోట్లు అందుబాటులో ఉన్నాయని తెలియజేశారు. గోదావరి పరిహార ప్రాంతాలలోని గ్రామాలకు గోదావరి జలాలతో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నూతన పరిజ్ఞానంతో కరకట్ట నిర్మాణం చేపట్టడం జరుగుతుందని, ప్రస్తుత సమయంలో ఎగువన కురుస్తున్న భారీ వర్షాల కారణంగా గోదావరి ఉధృతి పెరిగిందన్నారు.

### అప్రమత్తంగా ఉండాలి..

జిల్లాలోని పలు లోతట్టు ప్రాంతాలలో ప్రజలను అప్రమత్తం చేయడమే కాకుండా వారికి నెలకు సరిపడే నిత్యవసర వస్తువులను సిద్ధం చేశామన్నారు. ఎన్ డీఆర్ఎఫ్ బృందాలతోపాటు అగ్నిమాపక సిబ్బంది కూడా సిద్ధంగా ఉందన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాల్సిన బాధ్యత అధికారులదే అన్నారు. అత్యవసర సేవలకు గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు ప్రభుత్వ యంత్రాంగం అందుబాటులో ఉండాలని ఆదేశించారు. పొంగిపొర్లే వాగులు, రహదారుల్లో భారీకేడ్లు ఏర్పాటు చేయాలని, సూచిక బోర్డులు ఎర్పాటు చేయాలని ఆయన ఆదేశించారు. ప్రజలు అత్యవసర సేవలకు తహసీల్దార్, ఎంపీడీఓ, గ్రామ కార్యదర్శులను సంప్రదించాలని జిల్లా కలెక్టర్ సూచించారు.

### కంట్రోల్ రూం ఏర్పాటు..

తక్షణ సహాయం కొరకు ఐటీడీఏ ఏటూరు నాగారంలో కంట్రోల్ రూమ్ సెల్ నెంబర్ 6309842395, ల్యాండ్ లైన్ నెంబర్ 08717-293246 లకు సంప్రదించాలని కలెక్టర్ సూచించారు. కంట్రోల్ రూమ్‌లో 24 గంటలు అధికారులు, సిబ్బంది షిఫ్టుల వారిగా అందుబాటులో ఉంటారన్నారు. వరద ఉధృతి ఎక్కువైతే వెంటనే జిల్లా యంత్రాంగం ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలకు వెళ్లాలని సూచించారు. ఎలాంటి ప్రాణ నష్టం జరగకుండా ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తుందని, ప్రజలు సహకరించాలని కలెక్టర్ కోరారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి డీసీఎస్ఓ రాంపతి, ఇరిగేషన్ ఈఈ జగదీశ్వర్, కాంట్రాక్టర్, తహసిల్దార్ జగదీష్, ఎంసీడీఓ రాజ్యలక్ష్మి, ఎంపీఓ, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# నెక్కొండలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు

**వరంగల్ వాయిస్, నెక్కొండ :** వరంగల్ జిల్లా నెక్కొండ మండలంలో పలు కార్యాలయాలలో శుక్రవారం జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. మండలంలోని తెలంగాణ రెసిడెన్షియల్ స్కూల్ అండ్ జూనియర్ కాలేజ్, జడ్పీహెచ్ఎస్ నెక్కొండ, బాలిక ప్రాథమిక పాఠశాల, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, మండల వ్యవసాయ కార్యాలయం, నెక్కొండ మండలం అప్పలరావుపేటలో ప్రాథమిక పాఠశాల, ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రం, అలాగే ప్రాథమిక ఉన్నత పాఠశాల బొల్లి కొండ , ప్రజా పాలన కేంద్రాన్ని, ఎంపీడీవో కార్యాలయాన్ని తనిఖీ చేసి సమర్ధ నిర్వహణకు అధికారులకు పలు సూచనలు చేశారు.



# దత్తక్షేత్రంలో 21న గురు పౌర్ణమి ఉత్సవాలు

**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** అవధూత దత్త పీఠాధిపతి శ్రీ గణపతి సచ్చిదానంద స్వామీజీ, దత్తపీఠ ఉత్తరాధిపతి శ్రీ దత్త విజయానంద తీర్థ స్వామీజీ దివ్య ఆశీస్సులతో ములుగు రోడ్డులోని శ్రీ గణపతి సచ్చిదానంద వరద దత్తక్షేత్రంలో ఆదివారం గురు పౌర్ణమి ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు ఎస్ జీఎస్ దత్త జ్ఞాన బోధ సభ వరంగల్ ట్రస్ట్ తెలిపింది. ఉదయం 9 గంటల నుంచి దత్తాత్రేయ స్వామి వారి ఉత్సవ మూర్తికి భక్తులచే తైలాభిషేకం, 10 గంటలకు శ్రీ దత్త మూల మంత్ర హోమం, మధ్యాహ్నం 12 గంటలకు సుగంధ తైలాభిషేకం, సుగంధ ద్రవ్యాలు, పంచామృతాభిషేకం నిర్వహించనున్నట్లు ప్రకటించారు. అనంతరం శ్రీ గురుపాదుకా పూజ, గురు గీతా పారాయణం, అలంకరణ, విశేషార్చన, హారతి, తీర్థ ప్రసాదం, అన్న ప్రసాద వితరణ జరుగుతుందన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని శ్రీ స్వామి వారి అనుగ్రహం పొందాలని సూచించారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DIST DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com